# తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకున్న 5 వేల మంది భక్తులు

**ఆదివారం ఒక్కరోజే రూ.3.23 లక్షల ఆదాయం**

**పెన్ పవర్, ప్రతినిధి (తుని), సెప్టెంబర్ 20**: తుని మండలం లోవ శ్రీ తలుపులమ్మ దేవస్థానంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సుమారు 5 వేల మంది భక్తులు శ్రీ తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలను దేవస్థానం అధికారులు, ధర్మకర్తల మండలి పర్యవేక్షించారు. ఆదివారం దేవస్థానానికి వివిధ సేవల ద్వారా మొత్తం రూ.3,23,169 ఆదాయం సమకూరినట్లు కార్యనిర్వహణాధికారి శ్రీ విశ్వనాథరాజు తెలిపారు. ఇందులో ప్రసాదాల విక్రయం ద్వారా రూ.85,150, పూజా టికెట్ల ద్వారా రూ.1,33,120, కేశఖండన టికెట్ల ద్వారా రూ.7,280, వాహన పూజలు, ఇతర సేవల టికెట్ల ద్వారా రూ.13,908, కాటేజీల ద్వారా రూ.50,885, ఇతర విరాళాల ద్వారా రూ.23,898, వేద ఆశీర్వచనం ద్వారా రూ.8,928 ఆదాయం వచ్చినట్లు వివరించారు. భక్తులకు



ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని సదుపాయాలను కార్యనిర్వహణాధికారి శ్రీ విశ్వనాథరాజు, దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పి. భాస్కర సత్యనారాయణ పర్యవేక్షించారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయం..




- తాగునీరు, మరుగుదొడ్లు లేక అవస్థలు
- అట్టహాసంగా ప్రారంభం.. ఐదు నెలలైనా పూర్తికాని పనులు
- తాగునీటి వసతి లేక సిబ్బంది, ప్రజల అవస్థలు
- అసంపూర్తిగా మరుగుదొడ్ల నిర్మాణం
- మౌలిక వసతులు లేక సేవలకు ఆటంకం
- ఎన్టీ రాజాపురంతో పాటు గోపాలపురం ప్రజలకు సేవలు
- కార్యాలయానికి వచ్చే లబ్ధిదారులకు తప్పని ఇబ్బందులు
- ప్రజాధనం ఖర్చు చేసినా సౌకర్యాలు మాత్రం కరువు
- అధికారుల పర్యవేక్షణపై స్థానికుల ప్రశ్నలు
- పూర్తికాని పనులపై ప్రజల్లో అసంతృప్తి
- త్వరితగతిన మిగిలిన పనులు పూర్తి చేయాలని డిమాండ్
- గండేపల్లి మండలం ఎన్టీ రాజాపురం గ్రామంలోని సచివాలయం ప్రారంభమై నెలలు గడుస్తున్నా.. ప్రజలకు అందాల్సిన కనీస మౌలిక వసతులు మాత్రం అందుబాటులోకి రాలేదు. తాగునీరు, మరుగుదొడ్లు సహా పలు సౌకర్యాలు అసంపూర్తిగా ఉండటంతో కార్యాలయ సిబ్బందితో పాటు సేవల కోసం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- నిర్లక్ష్యానికి నిదర్శనం.. ఎన్టీ రాజాపురం సచివాలయం!
- రూ.43.60 లక్షల ప్రజాధనం వెచ్చించినా.. పూర్తిస్థాయి సౌకర్యాలకు నోచుకోని వైనం

**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్, కాకినాడ/ గండేపల్లి, సెప్టెంబర్ 20 :** ప్రభుత్వ కార్యాలయం అంటే ప్రజలకు సేవలు అందించే కేంద్రం. గ్రామ సచివాలయం అంటే మరింతగా ప్రజలకు అందుబాటులో ఉండే పరిపాలనా వేదిక. అలాంటి సచివాలయంలో కనీస మౌలిక వసతులు లేకపోతే పరిస్థితి ఎలా ఉంటుంది? గండేపల్లి మండలం ఎన్టీ రాజాపురం గ్రామ సచివాలయం ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. స్వర్ణ పంచాయతీ పేరుతో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సుమారు రూ.43.60 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ 2026 మార్చి 30న అట్టహాసంగా ప్రారంభించారు. అయితే భవనం ప్రారంభమై సుమారు ఐదు నెలలు గడుస్తున్నా.. ప్రజలకు అవసరమైన పలు మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకపోవడం విమర్శలకు తావిస్తోంది.



**ప్రారంభోత్సవానికి హడావుడి.. సౌకర్యాలపై మాత్రం నిర్లక్ష్యం?**

భవన నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రజలకు సేవలు మరింత సులభంగా అందుతాయని స్థానికులు ఆశించారు. అయితే కార్యాలయం వినియోగంలోకి వచ్చిన తర్వాతే అసలు సమస్యలు వెలుగులోకి వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ సిబ్బంది, వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మరుగుదొడ్లు ఉన్నా.. ఉపయోగానికి మాత్రం?**

సచివాలయంలో మరుగుదొడ్ల నిర్మాణం కూడా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదని స్థానికుల ఆరోపణ. ప్రభుత్వ కార్యాలయానికి ప్రతిరోజూ సిబ్బందితో పాటు వివిధ పనుల నిమిత్తం ప్రజలు వస్తుంటారు. అలాంటి చోట కనీస పారిశుధ్య సదుపాయాలు అందుబాటులో లేకపోవడం అసౌకర్యానికి దారితీస్తోందని వారు చెబుతున్నారు.

**రెండు గ్రామాల ప్రజలకు ఒకే సచివాలయం**

ఎన్టీ రాజాపురం గ్రామ ప్రజలకే కాకుండా గోపాలపురం గ్రామానికి కూడా ఈ సచివాలయం సేవలు అందించాల్సి ఉంది. దీంతో ప్రతిరోజూ రెండు గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ ప్రభుత్వ సేవల కోసం కార్యాలయాన్ని ఆశ్రయిస్తుంటారు.

ప్రజల రాకపోకలు ఉండే కార్యాలయంలోనే తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర ప్రాథమిక వసతులు పూర్తిగా అందుబాటులో లేకపోవడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**ప్రజాధనం వెచ్చించినా.. ప్రయోజనం పూర్తిస్థాయిలో దక్కేనా?**

లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ భవనం ప్రారంభమైన తర్వాత కూడా అవసరమైన మౌలిక వసతులు అందుబాటులోకి రాకపోవడంపై స్థానికులు ప్రశ్నలు సంధిస్తున్నారు.

భవన నిర్మాణం, ప్రారంభోత్సవంతోనే ప్రభుత్వ బాధ్యత ముగిసిపోదని.. ప్రజలకు పూర్తిస్థాయి సేవలు అందేలా అవసరమైన వసతులను కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని వారు పేర్కొంటున్నారు.

**అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?**

సచివాలయ నిర్మాణ పనులు, మౌలిక వసతుల కల్పన, వాటి వినియోగయోగ్యతపై సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సి ఉన్నప్పటికీ.. పరిస్థితి ఇలా ఉండటంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రారంభించి ఐదు నెలలు గడుస్తున్నా సమస్యలు పరిష్కారం కాకపోవడం అధికారుల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

**వెంటనే స్పందించాలని ప్రజల విజ్ఞప్తి**

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సచివాలయంలో పూర్తికాని మౌలిక వసతులు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలను త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించాల్సిన సచివాలయం.. కనీస వసతుల కోసం ప్రజలు ఎదురుచూసే కేంద్రంగా మారకూడదని వారు అభిప్రాయపడుతున్నారు. లక్షలాది రూపాయలతో నిర్మించిన భవనానికి పూర్తిస్థాయి సదుపాయాలు కల్పించి, సచివాలయ సేవలను ప్రజలకు ఇబ్బందులు లేకుండా అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

# మంత్రి నారా లోకేష్‌కు సాదర వీడ్కోలు





**కాకినాడ రూరల్, పెన్ పవర్,సెప్టెంబర్ 20:** కాకినాడ జిల్లా ఒకరోజు పర్యటనలో భాగంగా తిమ్మాపురంలోని ఆకుండి లక్ష్మీ స్మారక గోశాలలో నిర్వహించిన 'భారతీయం' కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర విద్య, మానవ వనరులు, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌కు ప్రజాప్రతినిధులు సాదర వీడ్కోలు పలికారు.విద్యార్థుల్లో దేశభక్తి, నైతిక విలువలను పెంపొందించే ఉద్దేశంతో పాఠశాల విద్యాశాఖ, ఏపీ ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో 'భారతీయం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు.జిల్లా పర్యటన ముగించుకుని ఆదివారం మధ్యాహ్నం 2.45 గంటలకు మంత్రి నారా లోకేష్ రోడ్డు మార్గంలో రాజమహేంద్రవరం విమానాశ్రయానికి బయలుదేరారు. ఈ సందర్భంగా కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన్నరాజప్ప, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తదితర ప్రజాప్రతినిధులు మంత్రికి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ జి.నాగమణి, కాకినాడ జిల్లా విద్యాధికారి పి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# 'భారతీయం' కార్యక్రమానికి హాజరైన మంత్రి నారా లోకేష్







## మంత్రి లోకేష్ కు ఘన స్వాగతం

**కాకినాడ రూరల్ ,పెన్ పవర్,సెప్టెంబర్ 20:** కాకినాడ రూరల్ నియోజకవర్గం తిమ్మాపురం సమీపంలోని ఆకుండి లక్ష్మీ స్మారక గోశాలలో ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ, కాకినాడ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహిం చిన 'భారతీయం' ప్రత్యేక కార్యక్రమానికి రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఐటీ శాఖ మంత్రి లోకేష్ కు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు.ఏపీ ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు, ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మంత్రి నారా లోకేష్‌కు రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు.కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన్నరాజప్ప, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలులో విఫలమైన పాలనపై పోరు





**ప్రజా సమస్యలపై వైసీపీ ఉద్యమం కొనసాగుతుంది: తోట నరసింహం**

**గండేపల్లి,పెన్ పవర్, సెప్టెంబర్ 20:** ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో తెలుగుదేశం ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, జగ్గంపేట వైసీపీ ఇన్‌చార్జి తోట నరసింహం విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం వైసీపీ శ్రేణులు ప్రజలతో కలిసి నిరంతరం పోరాటం కొనసాగిస్తాయని ఆయన అన్నారు.గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామంలోని శుభప్రద కళ్యాణ మండపంలో ఆదివారం మండల వైసీపీ అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో తోట నరసింహం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండల పరిషత్ అధ్యక్షుడు చలగళ్ల దొరబాబుతో పాటు 14 మంది ఎంపీటీసీల పదవీకాలం పూర్తవుతున్న సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందంటూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన ఆరోపణలకు దర్యాప్తు నివేదికలు పూర్తి మద్దతు ఇవ్వలేదని తోట నరసింహం పేర్కొన్నారు. జంతువుల కొవ్వు ఉన్నట్లు నిర్ధారణ కాలేదన్న దర్యాప్తు వివరాలు వెలుగులోకి రావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. తిరుమల వంటి పవిత్రమైన అంశాలను రాజకీయాలకు వేదికగా మార్చకూడదని అన్నారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి వైసీపీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.అనంతరం పదవీకాలం పూర్తిచేసుకున్న ఎంపీపీ చలగళ్ల దొరబాబు, 14 మంది ఎంపీటీసీ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు రామకుర్తి శ్రీరామచంద్రమూర్తి, ఒమ్మి రఘురాం, గుల్లా ఏడుకొండలు, రావుల గణేష్ రాజా, బిట్రా గిరిబాబు, తాళ్లూరి మధుకుమార్, కుంచే చినబాబు, పలికెల గంగరాజు, పోకల సుబ్బారావు, ఒబిణ్ణి వీరబాబు, అవసరాల పార్థసారథి, రామకుర్తి జగాలు, తోట అయ్యన్న, తోట బాబ్జి, బిట్రా వెంకటరమణ, బత్తుల వీరబాబు, గొర్రెల శివ, కోడిగుడ్ల రాంబాబు, అడబాల సూరిబాబు, జాజిమొగ్గల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## సామర్లకోట రైల్వే స్టేషన్ లో 'స్వచ్ఛత హి సేవా' కార్యక్రమం








**సామర్లకోట పెన్,పవర్..సెప్టెంబర్ 20:**భారతీయ రైల్వే ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 15 వరకు జరగనున్నాయి. ఇందులో భాగంగా ఆదివారంలిసామర్లకోట జంక్షన్ రైల్వే స్టేషన్‌లి లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్టేషన్ ఆవరణం, కాలనీ, పార్కింగ్ ఏరియాల్లో శ్రమదానం చేసి చెత్తను తొలగించారు.ఈ కార్యక్రమంలో సుమారు 40 మంది పాల్గొన్నారు. అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ప్రభాకర్, స్టేషన్ మేనేజర్ రమేష్, హెల్త్ ఇన్స్పెక్టర్ కళ్యాణి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ గిరి, కమర్షియల్ ఇన్స్పెక్టర్ మధు, స్టేషన్ మాస్టర్స్ దీపక్ రాజ్ , హేమసుందర్ లి సిబ్బంది, వివిధ డిపార్ట్మెంట్ల స్టాఫ్, రిటైర్డ్ ఎంప్లాయిస్ కాలనీ ప్రజలు మరియు కాంట్రాక్ట్ స్టాఫ్ పాల్గొని స్టేషన్ ను శుభ్రం చేశారు.


## ఘనంగా వినాయక నిమజ్జనం.



**సామర్లకోట... పెన్ పవర్.... సెప్టెంబర్ 20...**సామర్లకోట పట్టణం పరిధిలో గల శ్రీ విశాలాక్షి నగర్ నందు నిర్వహించిన గణపతి ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యాహ్నం అన్నసమారాధన అనంతరం వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. గత నాలుగు సంవత్సరాలుగా మట్టివినాయక విగ్రహం ఏర్పాటుచేసి కాలనీ వాసులందరూ భజన గీతాలు,నృత్యాల తో కాలనీ వీధులలో విగ్రహం ఊరేగించి అనంతరం నీటి కుండీలో విగ్రహాన్ని నిమజ్జనచేయడం జరుగుతుంది. వినాయక చవితి రోజు నుండి ప్రతీ రోజు ఉదయం సాయంత్రం పూజలు, స్వామివారికి పూజలు సాయంత్రం లలిత సహస్ర నామ పఠనం నిర్వహించడం జరిగిందని తెలిపారు. సుమారు పది కిలోల స్వామివారి లడ్డూ లక్కీ డిప్ ద్వారా జాతీయ పర్యావరణ మిత్ర గంగాధర్ కు లభించిందని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నిమజ్జన కార్యక్రమంలో డి.సూర్య ఉదయ భాస్కర్,స్వామి, రవి,పి.గంగాధర్, నలమాటి శ్రీను, గోలి బాబ్జీ, టి గంగాధర్, టీచర్ ఇబ్రహీం,శ్రీనివాస్, రాజు,శ్రీరామచంద్రరావు, ఆనంద్ అధిక సంఖ్యలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పండూరులో అగ్ని ప్రమాదం-భారీగా ఆస్తి నష్టం





**కాకినాడ రూరల్, పెన్ పవర్,సెప్టెంబర్ 20:** కాకినాడ రూరల్ మండలం పండూరు గ్రామంలో శనివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. వలవల వీరబాబు (చిన్నా) ఇంటి వద్ద అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మంటలు వేగంగా వ్యాపించడంతో ఇంటి సముదాయంలోని సామగ్రి, వస్తువులు, ఇతర ఆస్తులు కాలిపోయినట్లు సమాచారం.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని కొంతసేపు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో మంటలు మరింత విస్తరించకుండా అడ్డుకట్ట పడింది.ఈ ఘటనలో భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. అయితే నష్టం విలువ ఎంతన్నది అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది. ప్రమాదానికి షార్ట్‌సర్క్యూట్ కారణమా, ఇతర కారణాలున్నాయా అనే విషయంపై పోలీసులు, రెవెన్యూ అధికారులు వివరాలు సేకరిస్తూ దర్యాప్తు చేస్తున్నారు.అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ఆదిత్య యూనివర్సిటీలో ఎంఎస్సీ రియల్ ఎస్టేట్ వాల్యుయేషన్ కోర్సు ప్రారంభం






**ఐఓవీ ఆధ్వర్యంలో సాంకేతిక సదస్సు.. వాల్యుయేషన్ రంగంపై నిపుణుల అవగాహన**

**గండేపల్లి,పెన్ పవర్, సెప్టెంబర్ 20:** గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ వాల్యుయర్స్ (ఐఓవీ) విశాఖపట్నం శాఖ ఆధ్వర్యంలో ఎంఎస్సీ రియల్ ఎస్టేట్ వాల్యుయేషన్ పీజీ కోర్సు ప్రారంభోత్సవంతో పాటు నెలవారీ సాంకేతిక సదస్సును శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వాల్యుయేషన్ రంగానికి చెందిన పలువురు నిపుణులు, ఐఓవీ ప్రతినిధులు హాజరయ్యారు.కార్యక్రమానికి ఐఓవీ ఢిల్లీ జనరల్ సెక్రటరీ డా. వినయ్ కె. గోయల్ ముఖ్య అతిథిగా, ఆదిత్య యూనివర్సిటీ ప్రో-చాన్సలర్ డా. ఎన్. సతీష్ రెడ్డి గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఎంఎస్సీ రియల్ ఎస్టేట్ వాల్యుయేషన్ కోర్సు సమన్వయకర్త, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా. బి. రామ్ మోహన్ రెడ్డి కోర్సు లక్ష్యాలు, ప్రాధాన్యతలను వివరించారు.

రియల్ ఎస్టేట్ వాల్యుయేషన్ రంగంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సాంకేతిక పరిజ్ఞానం, వృత్తిపరమైన నైపుణ్యాలను అందించడమే కోర్సు ఉద్దేశమని తెలిపారు. అనంతరం డా. వినయ్ కె. గోయల్ చేతుల మీదుగా పీజీ కోర్సును అధికారికంగా ప్రారంభించారు.సాంకేతిక సదస్సులో ఐఓవీ విశాఖపట్నం చైర్మన్ ప్రొఫెసర్ డా. బాదం సుందరరావు, ఐఓవీ హైదరాబాద్ చైర్మన్ వి.ఆర్. పాగోలు మధు, రిజిస్టర్డ్ వాల్యుయర్ వి. రవి వర్మ ఐవీఆర్, సీనియర్ అడ్వకేట్ పి. శ్రీనివాసరావు సాంకేతిక అంశాలపై ప్రసంగించారు. వాల్యుయేషన్ రంగంలో తాజా పరిణామాలు, వృత్తిపరమైన అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి, గౌరవ అతిథి, ఐఓవీ చైర్మన్లు, ఇతర ప్రముఖులను సత్కరించారు. అనంతరం నిపుణులు, ఐఓవీ సభ్యులు, విద్యార్థుల మధ్య పరస్పర చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఆదిత్య యూనివర్సిటీ--ఐఓవీ మధ్య విద్యా, సాంకేతిక, వృత్తిపరమైన సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

## ఉప్పలపాడులో శోభాయమానంగా వరసిద్ధి వినాయక మహోత్సవాలు

**భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. ఘనంగా అన్నసమారాధన**



**గండేపల్లి, పెన్ పవర్: సెప్టెంబర్, 20** గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామంలో వినాయక చవితిని పురస్కరించుకుని వరసిద్ధి వినాయక మూడో వార్షికోత్సవ మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. వరసిద్ధి వినాయక యూత్ కమిటీ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.

తమటం నాగేంద్ర--సీతామహాలక్ష్మి దంపతులు పీఠంపై కూర్చుని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.గ్రామ ప్రజల సహకారంతో అనంతరం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామకుర్తి సత్తిబాబు గురువు, సిరిదెల్ల అబ్బులు గురువు, అడపాల రామాంజనేయులు, రామకుర్తి శ్రీరామచంద్రమూర్తి, మేడిపోయిన శ్రీను, తోరాటి వెంకన్న, సత్తి సోమరాజు, గంటా ఉమామహేష్, కాపవరపు ప్రసాద్, కోరుకొండ రామాంజనేయులు, దూది బాల జగదీష్, అంకం రామాంజనేయులు, దొడ్డా కాటమరాజు, నల్లమిల్లి శ్రీనివాస్, అడపా సూర్య పవన్, దూది నాగశివతో పాటు వరసిద్ధి వినాయక యూత్ కమిటీ సభ్యులు, వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కరాటే పోటీల్లో ప్రత్తిపాడు విద్యార్థులకు బంగారు పతకాలు.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, సెప్టెంబర్,20:**యానాం రీజియన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఇంటర్ స్టేట్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రత్తిపాడు కరాటే స్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరచడమే కాకుండా బంగారు పతకాలు సాధించినట్లు కరాటే స్కూల్ మాస్టర్ పి బుజ్జి తెలిపారు. కాటా సీనియర్ విభాగంలో నిర్వహించిన ఈ ఛాంపియన్ షిప్ పోటీల్లో 15 మంది విద్యార్థులు బంగారు పథకాలు, ఇద్దరు విద్యార్థులు సిల్వర్ పతకాలు సాధించినట్లు ఆయన తెలిపారు. విజేతలకు యానాం రీజియన్ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు జి జయ రామారావు, కార్యదర్శి ఎం అరవింద వ్యాస్ తదితరులు పాల్గొని మెడల్స్ తో పాటు, ప్రశంసా పత్రాలను అందజేసినట్లు బుజ్జి ఈ సందర్భాగా తెలిపారు. విజేతలుగా బంగారు పథకాలు సాధించిన తమ స్కూల్ విద్యార్థులను స్కూల్ మాస్టర్ బుజ్జి ఈ సందర్భంగా అభినందించారు.

## విద్యార్థుల్లో స్ఫూర్తినింపిన 'భారతీయం'







**కాకినాడ రూరల్ , పెన్ పవర్,సెప్టెంబర్ 20:** భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, దేశభక్తి, సేవాభావం, సైనికుల త్యాగాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో కాకినాడ జిల్లా తిమ్మాపురంలోని ఆకుండి లక్ష్మీ స్మారక గోశాలలో 'భారతీయం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కార్యక్రమంలో వేదపండితులు మంత్రికి ఆశీర్వచనాలు అందించగా,చాగంటి కోటేశ్వరరావు వేద ఆశీర్వచనం అందించారు. కంచి కామకోటి పీఠం 68వ పీఠాధిపతి శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామి (కంచి పరమాచార్య) రచించిన 'దేవుని స్వరం' పుస్తకాలను మంత్రి నారా లోకేష్‌కు బహుకరించారు. అనంతరం సత్సంగం సభ్యులతో మంత్రి ముచ్చటించారు.ఈ సందర్భంగా భారతమాతకు 108 మంత్రాలతో పుష్పాంజలి సమర్పించారు. భారతీయతను ప్రతిబింబించే శబ్దాలు, స్వరాలను మేళవిస్తూ 'వందేమాతరం' గీతాలాపనతో భారతమాతకు వినూత్నంగా హారతులు ఇచ్చారు.

మాజీ సైనికుడు డా.కిరణ్ కుమార్ భారత సైన్యంలో తాను అందించిన సేవలు, అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు.దేశ రక్షణ కోసం ఆయన అందించిన సేవలను అభినందిస్తూ మంత్రి నారా లోకేష్ ఆయనను ఘనంగా సత్కరించారు.అనంతరం విద్యార్థులకు మెమెంటోలు అందజేసి సత్కరించారు. భారతీయ సంస్కృతి,ఆధ్యాత్మికతతో పాటు దేశభక్తి,జాతీయ భావాలు, సేవాభావాన్ని విద్యార్థులు,యువతలో పెంపొందించేలా 'భారతీయం' కార్యక్రమం కొనసాగింది.

# రైతు సంక్షేమంపై చంద్రబాబు దూరదృష్టి



**వైసీపీ నేతలు ప్రతి అంశాన్ని రాజకీయం చేస్తున్నారు.. సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**

**రావులపాలెం, పెన్ పవర్ సెప్టెంబర్ 20 :**రైతు సంక్షేమం, సాగునీటి సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టితో ఆలోచిస్తూ నిర్ణయాలు తీసుకుంటున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను సైతం రాజకీయ ప్రయోజనాల కోసం విమర్శలకు ఉపయోగించుకోవడం సరికాదని ఆయన పేర్కొన్నారు. వైసీపీ నేతలు ప్రతి అంశాన్ని రాజకీయ కోణంలో చూస్తున్నారని విమర్శించారు.

రావులపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం కారణంగా పలు ప్రాంతాల్లో సాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. ఇటువంటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలపై దృష్టి సారిస్తోందన్నారు.

**పట్టిసీమ వంటి ప్రాజెక్టులతో ప్రయోజనం**

చంద్రబాబు ముందుచూపుతో చేపట్టిన పట్టిసీమ, పురుషోత్తపట్నం, వెలిగొండ వంటి సాగునీటి ప్రాజెక్టులు రైతులకు ఉపయోగపడుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. నీటి లభ్యతలో ఇబ్బందులు ఎదురైన సమయంలో సాగునీటిని అందుబాటులోకి తీసుకురావడానికి ఈ తరహా ప్రాజెక్టులు కీలకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.

ప్రభుత్వం రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం లేదని, కరువు పరిస్థితులను శాస్త్రీయంగా అంచనా వేసి అవసరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు. కరువు ప్రభావిత మండలాల గుర్తింపు, రైతులకు భరోసా కల్పించడం, సాగు--తాగునీటి సమస్యలను పరిష్కరించడం వంటి అంశాలపై అధికారులు చర్యలు చేపడుతున్నారని చెప్పారు.

యూరియా కొరతపై అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి

రాష్ట్రంలో యూరియా కొరత ఉందంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. ఎక్కడైనా సరఫరా సమస్యలు ఉంటే వాటిని అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.

**కాలువల నిర్వహణపై ప్రత్యేక దృష్టి**

నియోజకవర్గంలో సాగునీటి కాలువలు, లిఫ్ట్ ఇరిగేషన్‌ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఉచ్చిలి, వసంతవాడ, పేరవరం లిఫ్ట్ ఇరిగేషన్‌లతో పాటు కాలువల పరిస్థితిని పరిశీలించి అవసరమైన చోట మరమ్మతులు చేపడుతున్నామని చెప్పారు.

చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు. కాలువల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావు లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

**భూ సమస్యల పరిష్కారానికి రీసర్వే**

రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు రీసర్వే, రెవెన్యూ రికార్డుల సవరణపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని బండారు తెలిపారు. ఞ= కోడ్, రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌బుక్స్ అందించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. భూ రికార్డుల్లో లోపాల కారణంగా రైతులు ఇబ్బందులు పడకుండా సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**ధాన్యం కొనుగోళ్లలో వేగం**

రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన అనంతరం చెల్లింపులు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. రైతులకు సకాలంలో డబ్బులు అందేలా కొనుగోలు వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు.

**నిత్యావసర ధరల నియంత్రణకు చర్యలు**

వాతావరణ పరిస్థితులు, అంతర్జాతీయ పరిణామాల ప్రభావంతో కొన్ని నిత్యావసర వస్తువుల ధరల్లో మార్పులు వస్తున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. బియ్యం, ఉల్లిపాయలు తదితర వస్తువులను ప్రజలకు అందుబాటులో ఉండే ధరలకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

**ఎంఆర్పీ కంటే అధికంగా వసూలు చేస్తే చర్యలు**

మద్యం విక్రయాల్లో ఎంఆర్పీ కంటే అధికంగా ధరలు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ విషయంపై అధికారులతో మాట్లాడి, నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు విక్రయాలు జరిగితే చర్యలు తీసుకోవాలని సూచించినట్లు చెప్పారు.

**ఇసుక సరఫరాలో పారదర్శకత**

ఇసుక సరఫరాలో ప్రజలకు అందుబాటులో ఉండే విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని బండారు తెలిపారు. రవాణా, జీఎస్టీ తదితర చట్టబద్ధమైన ఖర్చులు మినహా అదనపు భారం ప్రజలపై పడకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

**వాడపల్లి ఆలయ అభివృద్ధికి ప్రాధాన్యత**

వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. భక్తుల రాకపోకలు, మౌలిక సదుపాయాల మెరుగుదలకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

**అభివృద్ధి పనులకు వేగం**

కొత్తపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో రోడ్లు, సాగునీరు, రవాణా, దేవస్థానాలు తదితర రంగాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని బండారు సత్యానందరావు తెలిపారు. బొద్దం లిఫ్ట్ ఇరిగేషన్, రావులపాలెం--వాడపల్లి రహదారి, సర్వీస్ రోడ్లు తదితర పనులపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు.

**విమర్శలకంటే సమస్యల పరిష్కారమే ముఖ్యం**

ప్రభుత్వంపై విమర్శలు చేయడం కంటే ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రతిపక్ష నేతలకు సూచించారు. రాజకీయ విమర్శలకు మాత్రమే పరిమితం కాకుండా నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. గత పాలనలో జరిగిన పరిణామాలను ప్రజలు గమనించారని, ప్రస్తుతం ప్రభుత్వం చేపడుతున్న పనులను కూడా ప్రజలు పరిశీలిస్తున్నారని అన్నారు. రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

**శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు**

గంజాయి, అక్రమ కార్యకలాపాలు, చట్టవిరుద్ధ చర్యలను అరికట్టేందుకు పోలీసు శాఖ చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు.

**అభివృద్ధికి అందరి సహకారం అవసరం**

ప్రజల నుంచి వచ్చే సూచనలు, సలహాలను స్వీకరించి వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, కొత్తపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లి మంగాదేవి భీమారావు, సీనియర్ టీడీపీ నాయకులు గుత్తుల పట్టాభి, మండల పార్టీ అధ్యక్షులు కొప్పిశెట్టి ప్రసాద్, మేడపాటి కాసురెడ్డి, ఐటీడీపీ అధ్యక్షులు కుసుమె సురేష్, రావులపాలెం గ్రామ పార్టీ అధ్యక్షులు కొవ్వూరు అచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేవరాపల్లి పంచాయతీలో సమస్యలపై నాయకుల పర్యటన



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 20:**మండలంలోని దేవరాపల్లి పంచాయతీ పరిధిలోని మల్లికార్జునులు, ఈతరొబ్బలు, తోకచిలక, బుగ్గిలోవ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు పర్యటించి గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానంగా రహదారి, ఓటరు కార్డులకు సంబంధించిన సమస్యలను గ్రామస్తులు నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. జీకే వీధి మీదుగా తీములుబంధ నుంచి ఆర్‌బీ రోడ్డు వరకు ఉన్న రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. అలాగే పెద్దపాడు, మెట్టగూడ, నక్కబంధ గ్రామాలకు చెందిన పలువురు తమ ఓటరు కార్డులు ప్రస్తుతం అమల్లో లేవని నాయకులకు వివరించారు. ఓటరు కార్డుల సమస్యపై గ్రామ సచివాలయ సిబ్బంది తక్షణమే స్పందించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. రహదారి సమస్యను కూడా సంబంధిత అధికారులు పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో వైఎస్సార్‌సీపీ పంచాయతీ అధ్యక్షులు కె. రామలింగం, ఉపాధ్యక్షులు జర్త బాబురావు, సీనియర్ మాజీ జెడ్పీటీసీ ఎం. మత్యారాజు, మండల కార్యవర్గ సభ్యులు డి. ఉదయ్ భాస్కర్, వివిధ విభాగాల నాయకులు ఆర్. రామారావు, కె. సతీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## లైసెన్స్ లేని వాహనాలు సీజ్ చేస్తాం

**జీకేవీధి ఎస్సై సురేశ్ హెచ్చరిక**




**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 20:**లైసెన్స్ పత్రాలు లేని వాహనాలను గుర్తించి సీజ్ చేస్తామని జీకేవీధి ఎస్సై సురేశ్ హెచ్చరించారు. మండలంలోని ముల్లుమెట్ట ప్రధాన రహదారిపై ఆదివారం ప్రమాదాల నివారణకు వేగ నియంత్రికలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై సురేశ్ మాట్లాడుతూ ప్రతి వాహనానికి తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని సూచించారు. లైసెన్స్ లేని వాహనాలపై చర్యలు తీసుకునేందుకు వారం రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేయడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అలాగే వాహనాలను తమ పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకోని వారు వారం రోజుల్లోగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు. రహదారి భద్రత నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్సై కోరారు.

## ఘనంగా నల్లూరి సూర్యనారాయణ జన్మదిన వేడుకలు



**కూర్మాన్న పాలెం: పెన్ పవర్, సెప్టెంబర్ 20:** 86వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ జన్మదినం వేడుకలను వార్డు కార్యవర్గ సభ్యులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక వార్డు కూటమి నాయకులు , కార్యకర్తలు శ్రేయోభిలాషులు పాల్గొని ఆయనకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నల్లూరు సూర్యనారాయణ మాట్లాడుతూ వార్డులో ఉన్న ప్రజలకు నిరంతరం అందుబాటులో ఎల్లప్పుడూ ఉంటు ఎలాంటి కష్టనష్టాల్లో అయినా సరే నిలబడతానని , తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో అధిష్టానం ఎవరికి టికెట్ ఇచ్చినా ఒక కార్యకర్తగా కష్టపడి గెలిపించుకుంటానని హామీ ఇచ్చారు. తన జన్మదిన వేడుకలకు విచ్చేసిన నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

## రౌడీషీటర్లకు గాజువాక సీఐ ప్రత్యేక కౌన్సిలింగ్



**గాజువాక : పెన్ పవర్, సెప్టెంబర్ 20 :**పారిశ్రామిక ప్రాంతం గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్ల ప్రవర్తన, వారి ప్రస్తుత పరిస్థితులు మరియు కదలికలపై ప్రత్యేక దృష్టి సారించిన గాజువాక పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్. వాసు నాయుడు రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రౌడీషీటర్లతో వ్యక్తిగతంగా మాట్లాడిన సీఐ వారి కుటుంబ పరిస్థితులు, జీవన విధానం, ఉపాధి తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. గతంలో జరిగిన సంఘటనలను పక్కనపెట్టి కుటుంబ బాధ్యతలను గుర్తించి సమాజంలో గౌరవప్రదంగా జీవించాలని సూచించారు.

ప్రత్యేకంగా యువతను వివాదాల్లోకి లాగడం, చిన్నచిన్న విషయాలకు గొడవలు చేయడం, మద్యం సేవించి అశాంతి సృష్టించడం, ఇతరులను ప్రేరేపించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. తమ ప్రవర్తన వల్ల కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. రౌడీషీటర్లు తమపై ఉన్న పోలీసుల నిఘాను ప్రతికూలంగా కాకుండా, తమ జీవితాన్ని మార్చుకునే అవకాశంగా తీసుకోవాలని సీఐ సూచించారు. ఎవరైనా తమను నేరాలకు ప్రోత్సహించినా లేదా వివాదాల్లోకి లాగేందుకు ప్రయత్నించినా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.


# కరాటే పోటీల్లో ప్రత్తిపాడు విద్యార్థులకు బంగారు పతకాలు.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, సెప్టెంబర్,20:**యానాం రీజియన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఇంటర్ స్టేట్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రత్తిపాడు కరాటే స్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరచడమే కాకుండా బంగారు పతకాలు సాధించినట్లు కరాటే స్కూల్ మాస్టర్ పి బుజ్జి తెలిపారు. కాటా సీనియర్ విభాగంలో నిర్వహించిన ఈ ఛాంపియన్ షిప్ పోటీల్లో 15 మంది విద్యార్థులు బంగారు పథకాలు, ఇద్దరు విద్యార్థులు సిల్వర్ పతకాలు సాధించినట్లు ఆయన తెలిపారు. విజేతలకు యానాం రీజియన్ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు జి జయ రామారావు, కార్యదర్శి ఎం అరవింద వ్యాస్ తదితరులు పాల్గొని మెడల్స్ తో పాటు, ప్రశంసా పత్రాలను అందజేసినట్లు బుజ్జి ఈ సందర్భాగా తెలిపారు. విజేతలుగా బంగారు పథకాలు సాధించిన తమ స్కూల్ విద్యార్థులను స్కూల్ మాస్టర్ బుజ్జి ఈ సందర్భంగా అభినందించారు.

# ఉప్పలపాడులో శోభాయమానంగా వరసిద్ధి వినాయక మహోత్సవాలు

**భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. ఘనంగా అన్నసమారాధన**



**గండేపల్లి, పెన్ పవర్: సెప్టెంబర్, 20** గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామంలో వినాయక చవితిని పురస్కరించుకుని వరసిద్ధి వినాయక మూడో వార్షికోత్సవ మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. వరసిద్ధి వినాయక యూత్ కమిటీ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. తమటం నాగేంద్ర--సీతామహాలక్ష్మి దంపతులు పీఠంపై కూర్చుని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గ్రామ ప్రజల సహకారంతో అనంతరం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామకుర్తి సత్తిబాబు గురువు, సిరిదెల్ల అబ్బులు గురువు, అడపాల రామాంజనేయులు, రామకుర్తి శ్రీరామచంద్రమూర్తి, మేడిపోయిన శ్రీను, తోరాటి వెంకన్న, సత్తి సోమరాజు, గంటా ఉమామహేష్, కాపవరపు ప్రసాద్, కోరుకొండ రామాంజనేయులు, దూది బాల జగదీష్, అంకం రామాంజనేయులు, దొడ్డా కాటమరాజు, నల్లమిల్లి శ్రీనివాస్, అడపా సూర్య పవన్, దూది నాగశివతో పాటు వరసిద్ధి వినాయక యూత్ కమిటీ సభ్యులు, వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

